క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

దుగ్గొండి : మండలంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ బైపీసీ విభాగంలో మొదటి సంవత్సరం సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ రజినీదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ–18, బీసీ–3, ఎస్టీ–2 సీట్లు ఉన్నాయని పదో తరగతి పాసైన బాలికలు ఈనెల 31లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 99088 59448 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

వర్ధన్నపేట : వర్ధన్నపేట 7వ డివిజన్ అంగన్‌వాడీ టీచర్ విధులకు హాజరు కావడం లేదని, బాలింతలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం దుర్వినియోగం చేస్తోందని ఈరెల్లి శ్రీనివాస్ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు.

సమాచారం కోసం దరఖాస్తు



నర్సంపేట రూరల్ : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామ ఆదాయ, వ్యయాలపై సమగ్ర సమాచారం అందించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యులు జన్ను రమేష్ తెలిపారు. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ సునీల్‌కుమార్ రాజ్‌కు నిధులు, వ్యయాలపై సమాచార హక్కు చట్టం –2005 కింద లిఖిత పూర్వకంగా వినతి అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత ముగుంపురం గ్రామానికి సంబంధించిన 2019–2023 సంవత్సరాల సంబంధించిన నిధులు, వాటి ఖర్చుల వివరాలను అందించాలన్నారు. కార్యక్రమంలో మాదాసి దేవేందర్, రమేష్, సునీల్, చేరాలు, కోడిపుంజుల బాబు, మేకల స్వామి, మాదాసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



పర్వతగిరి : మండలంలోని పర్వతాల శివాలయం వద్ద మార్కెట్ మంజూరైంది. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును సోమవారం సర్పంచ్ చింత పట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మాడుగుల రాజు పర్వతగిరిలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. జంగిలి భాస్కర్, బొట్ల పుష్పలత, రావుల కొమురయ్య, నీరటి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్యకు సత్కారం



నల్లబెల్లి : సామాజిక సేవా కార్యకర్త భట్టు సాంబయ్య ఇటీవల జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. కాగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సాంబయ్య చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, రంగాపురం సర్పంచ్ చీకటి ప్రకాశ్, నాయకులు పరికి కార్నేల్, సట్ల శ్రీనివాస్ గౌడ్, నాగెల్లి ఏలియా, గద్దె సారయ్య, పాడేటి కిశోర్, అనిల్, గుగ్గిళ్ల వెంకటేశ్వర్లు, తాడెం చంద్రమోహన్, కల్లెపెల్లి రఘువరణ్, ఎండీ షబ్బీర్ పాల్గొన్నారు.

పాపన్నకు నివాళి



దుగ్గొండి : బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మండలంలోని మల్లంపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి మొకుదెబ్బ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూర హేమచంద్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో తడుక కొంరెల్లి, గుండెబోయిన రమేష్, కక్కెర్ల రాజు, కుమారస్వామి, సారంగం పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ జాన్‌పాక బొడ్రాయి వద్ద పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం వారి నుంచి రూ.4,480 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పేకాడుతున్న బొటిక సంజీవ, తీగర దేవరాజ్, జల్లపెల్లి సునీల్‌కుమార్, తీగల సదానందం, బంక రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

అపరిశుభ్రంగా ఆర్టీసీ బస్టాండ్

- ఆవరణలో పందుల స్వైరవిహారం
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



నర్సంపేట బస్టాండ్ ఆవరణలో ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న పందులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట బస్టాండ్ అపరిశుభ్రంగా మారుతోంది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ ప్రాంతాల్లో పందుల స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులు నిలబడలేని పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఆవరణలో పందులు రాకుండా చర్యలు తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నర్సంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో నిత్యం ప్రయాణికుల రద్దీతో ఉంటుంది. వందలాది బస్సులు రోజు ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తూ ఉంటాయి. అంతేకాకుండా నర్సంపేట డివిజన్‌లోని ఆరు మండలాల నుంచే కాకుండా ములుగు జిల్లా కొత్తగూడ, గంగారం, మల్లంపల్లి, గూడూరు, పర్వతగిరి మండలాల నుంచి నర్సంపేటకు వచ్చి విద్యార్థులకు చదువుకుంటున్నారు. నర్సంపేట మండలంలోనే రెండు ఇంజినీరింగ్, ఇతర కళాశాలలు ఉండడంతో బస్టాండ్ ఆవరణమంతా కిటకిటలాడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. వివిధ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు సైతం వరంగల్, హనుమకొండ తదితర పట్టణాలకు నర్సంపేట నుంచే రాకపోకలు సాగిస్తు ఉంటారు. అయితే బస్టాండ్ ఆవరణలో పందులు స్వైర విహారం చేస్తుండడం, ఆవాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటుండడంతో దోమలు పెరిగి తదితర అంటువ్యాధులు సోకే ప్రమాదాలు ఉన్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి జనావాసాల్లో పందుల స్వైర విహారం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

చర్య తీసుకోవాలి



నర్సంపేట బస్టాండ్ ఆవరణలో విచ్చలవిడిగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో దోమలు విజృంభించి పలు రకాల వ్యాధులు సోకి ప్రయాణీకులు అనారోగ్యాల పాలయ్యే అవకాశం ఉంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పందులు రాకుండా చర్యలు తీసుకోవాలి.

– బొట్ల నరేష్, ప్రయాణికుడు

బస్‌పాస్ కౌంటర్ పక్కనే పందులు



నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోనే పందులు తిరుగుతున్నాయి. విద్యార్థులు బస్‌పాస్‌లు తీసుకునే కౌంటర్ సమీపంలో అవి ఆవాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నాయి. వర్షాలు పడితే పందుల స్వైర విహారం ఎక్కువగా ఉంటుంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– చింత సిద్ధు, విద్యార్థి

కార్యకర్తలను కాపాడుకుంటా..

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పెద్ది

నర్సంపేట : బీఆర్‌ఎస్‌లో చేరిన ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం నర్సంపేట పట్టణంలోని ద్వారకపేటకు చెందిన విక్టోరియస్ యూత్ క్లబ్ సభ్యులు, నర్సంపేట మండలం పాతముగ్దుంపురం గ్రామానికి చెందిన 15కుటుంబాలు, నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు మెంబర్లు, క్రియాశీలక కార్యకర్తలు, చెన్నారావుపేట మండలం లింగాపురం కాంగ్రెస్ పార్టీకి చెందిన పది కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, యువ నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి, పెండ్యాల యాదగిరి, వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, మండల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

నర్సంపేట రూరల్ : అభివృద్ధి పై ప్రతిపక్ష పార్టీలు ఏమైనా అభిప్రాయాలు ఉంటే చెప్పాలే కానీ, చౌకబారు విమర్శలు.. చిల్లర మాటలు మానుకోవాలని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేట మండలంలోని మహేశ్వరంలో బీఆర్‌ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి అందేలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ కోమాండ్ల జయ గోపాల్‌రెడ్డి,మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'బంధు'ల పేరుతో ఓట్ల రాజకీయం



దుగ్గొండి: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఖానాపురంలో..

దుగ్గొండి : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాగైనా లబ్ధిపొందాలని దళిత బంధు, బీసీ బంధు పేర్లతో ఓట్ల రాజకీయం చేస్తోందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరిగే ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బొబ్బరోనిపల్లిలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దళిత బంధు పథకమని నేటికి ఏ ఒక్కరికి పూర్తిస్థాయిలో అందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు, సొంత ఇంటి నిర్మాణానికి రూ. 6లక్షల సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోరె రాజేష్, చెన్నారపు రాజు, బొల్లం నాగరాజు, కొత్తపల్లి సాంబయ్య, మొట్టె లక్ష్మణ్, రజిత, స్వామి, కోడూరి రవి, శంకర్, శ్రవణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ నాయకులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న దొంగ హామీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి అందేలా కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పూల్‌సింగ్, నాయకులు ముస్తఫా, మోహన్, భానుప్రసాద్, బొమ్మగాని నవీన్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఇన్నారెడ్డి

వర్ధన్నపేట : కేన్సర్ పై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఇల్లంద సర్పంచ్ సుంకరి సాంబయ్య అన్నారు. లోడి సాంఘిక సేవాసంస్థ ఆధ్వర్యంలో స్నేహ హస్తం ప్రాజెక్ట్ కారితాస్ ఇండియా సహకారంతో సోమవారం మండలంలోని ఇల్లంద, వర్ధన్నపేట పట్టణంలో కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. లోడి సంస్థ గ్రామీణ ప్రాంతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. లోడి డైరెక్టర్ ఫాదర్ ఎస్.ఇన్నారెడ్డి మాట్లాడుతూ.. కేన్సర్‌పై పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకుంటూ రోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ శిబిరాన్ని సేయింట్ ఆన్స్ ఆస్పత్రి భాగస్వామ్యంతో నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ తోమోనమ్మ, ఆంకలోజిస్ట్ డాక్టర్ రాఘవయ్య, షరాన్ డెంటల్, సంతోష్, లోడి సంస్థ కో ఆర్డినేటర్స్ కె.సురేష్, ఎల్.వీరబాబు, మమత తదితరులు పాల్గొన్నారు.

ఏపీఓపై విచారణ

సంగెం : ఈజీఎస్‌లో ఏపీఓగా పనిచేస్తున్న లక్ష్మిపై ఏపీడీ సాయిచరణ్ విచారణ చేపట్టారు. ఈ నెల 10న ఏపీఓ ఇబ్బందులకు గురిచేస్తోందని డీఆర్‌డీఓ సంపత్‌రావుకు లిఖితపూర్వకంగా మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ నాయకుడు తిరుపతిరెడ్డి ఫిర్యాదు చేశారు. డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు సోమవారం సంగెం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీడీ సాయిచరణ్ జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లను విడివిడిగా, ఫీల్డ్ అసిస్టెంట్లను ఏపీఓ ఏ రకమైన ఇబ్బందులు పెట్టారని వాంగ్మూలాలు సేకరించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామానికి చెందిన మంద కళ్యాణి భర్త రమేశ్ ఇటీవల మృతిచెందాడు. కాగా కళ్యాణితో 2007–08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు(మిత్రులు)రూ. 44 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని సోమవారం ఆమెకు అందించారు. తాము అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. ఐలోని తిరుపతి, ఏకంబ సురేశ్, గట్ల శ్రీకాంత్, మార్త పృథ్వీరాజ్, అల్లం ప్రశాంత్, జన్ను సుమలత, గొర్రె కళ్యాణి, మంద సుమలత, మంద రమ, లక్ష్మి, రాధిక పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నరేశ్

గీసుకొండ : విద్యార్థులు తమ లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించడం, ఒత్తిడిని అధిగమించడమే విజయ రహస్యమని ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేషనల్ స్పీకర్ కటకం నరేశ్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటమి అంటే గట్టిగా ప్రయత్నించకపోవడమేనని అన్నారు. యువతకు ప్రేరణగా నిలిచిన స్వామి వివేకానందం, అబ్దుల్ కలాం లాంటి మహనీయుల జీవిత చరిత్రల్లో జరిగిన యదార్థ ఘటనలను వివరించి స్ఫూర్తి రగిలించాలన్నారు. హెచ్‌ఎం సుజాత, సమ్మిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమీక్ష

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారు లక్ష్మిగార్డెన్స్‌లో నేడు(మంగళవారం) కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రవీంద్ర ఉద్ధమ్‌రావు దళ్వి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు సంభాని చంద్రశేఖర్‌రావు, శోభారాణి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

వర్ధన్నపేట : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు మొక్కలు నాటి వాటిని రక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల కోసం విద్యార్థులందరు మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.సమత, శ్వేత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పోరాట అమరులకు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న చెన్నకేశవులు

నెక్కొండ : విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు కందిక చెన్నకేశవులు, ఈదునూరి వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం 23 ఏళ్ల క్రితం విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జరిగిన బషీర్‌బాగ్ దుర్ఘటనలో అసువులు బాసిన అమరవీరులకు వారు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్కరణల పేరుతో ప్రభుత్వాలు ప్రైవేటు పరం చేస్తూ.. సంస్థల మనుగడకు ముప్పు తెస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు దేవపాల, ఉప్పలయ్య, ఐలయ్య, వీరయ్య, కవిత, రవళి, శ్రీలత, యాకయ్య, సతీష్, ఎలయ్య, రజిత, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

సంగెం : వ్యవసాయంతో పాటు మహిళలు కుటీర పరిశ్రమలు స్థాపించి స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తీగరాజుపల్లి గ్రామంలో సంగెం యూనియన్ బ్యాంకు పీఎంఎఫ్‌ఎంఈ పథకం ద్వారా రూ.2లక్షల ఆర్థిక సాయంతో లబ్ధిదారురాలు హింగె సుజాత ఏర్పాటు చేసిన పిండి గిర్ని తదితర యంత్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందించే రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్జుగుత్త రమ గోపాల్, ఎంపీటీసీ రంగరాజు నర్సింహస్వామి, యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర అనిల్, డీపీఎం భవాని, ఏపీఎం దుంపేటి కిషన్, సీసీలు రాజయ్య, కృష్ణమూర్తి, వీఓఏలు విజయ్, కోమలత, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న బానోత్ సారంగపాణి

నల్లబెల్లి : మండలంలోని బజ్జుతండా గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులను సర్పంచ్ జాటోత్ పద్మతో కలిసి మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కింద రూ.20లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో స్థానిక ఉద్యోగులు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. నర్సంపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రిటైడ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయ్ సింగ్, డీఈ చందర్, ఎంపీటీసీ అజ్మీరా లక్ష్మి, ఏఈ చందర్, నాయకులు జాటోత్ రవి చిన్న, జర్పుల రాంసింగ్, సోమ్లా, కొమ్మాలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి భూమి పూజ


పర్వతగిరి : మండలంలోని చౌటపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం భవన నిర్మాణానికి పీఏసీఎస్ చైర్మన్ గొర్రె దేవేందర్ భూమి పూజ చేశారు. ఈ మేరకు రూ.60లక్షల నాబార్డు నిధులతో పీఏసీఎస్ భవన నిర్మాణంతో పాటు 300మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గోదాంలు నిర్మించడం రైతులకు సహకారంగా ఉంటుందని తెలిపారు.

అధికారులు హాజరు.. ప్రజాప్రతినిధుల గైర్హాజరు

- కోరం లేక మండల సభ వాయిదా



ఖాళీగా ఉన్న కుర్చీలు



సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీపీ

చెన్నారావుపేట : మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరయ్యారు..కానీ ప్రజాప్రతినిధులు మాత్రం గైర్హాజరయ్యారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి 30గ్రామాల సర్పంచ్‌లు, 11మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉంది. కాని జల్లి గ్రామ ఎంపీటీసీ, చెన్నారావుపేట ఎంపీపీ బాదావత్ విజేందర్ మాత్రమే హాజరయ్యారు. మిగతా వారు గైర్హాజరయ్యారు. సంబంధిత శాఖల అధికారులు మాత్రం సర్వసభ్య సమావేశానికి విధిగా హాజరయ్యారు. గ్రామాలలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎవరు హాజరు కాకపోవడంతో గంట పాటు వేచి చూసిన ఎంపీపీ పూర్తిస్థాయి కోరం లేకపోవడంతో మండల సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మూడు నెలలకు ఒక సారి జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల ప్రజా ప్రతినిధులు విధిగా హాజరై గ్రామాలలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాల్సి ఉంది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈగల భారతి, మండల పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజు, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీఓ అరుణ, చెన్నారావుపేట పశువైద్యాధికారి మంజిలాల్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సతీష్, హెచ్‌డబ్ల్యూ మధురిమ, ఐబీ ఏఈ సురేష్, సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డి, నర్సంపేట ఐసీడీఎస్ ఏసీడీపీఓ విద్య, సూపర్‌వైజర్ రాధ, జల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరళ, హార్టికల్చర్ అధికారి జ్యోతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదను రక్షించుకోవాలి




గీసుకొండ: పశువుకు టీకా వేస్తున్న బాధ్యులు

సంగెం : రైతులు తమ పశు సంపదను రక్షించుకోవాలని సర్పంచ్ గన్ను శారద అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్‌లో పశువులకు గాలికుంటు నివారణ టీకాల శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎర్రన్న, పశువైద్యులు భాణ్య నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గాలికుంటు నివారణ టీకా, నట్టల నివారణ మందును వేశారు. అలాగే లంపీ స్కిన్ వ్యాధి నివారణకు ముందు జాగ్రత్తగా టీకా వేసినట్లు మండల పశువైద్యాధికారి వడ్డేపల్లి రమేశ్ తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు సుంకరి శివ, కొట్టె కుమారస్వామి, పీఏఎస్ రమేశ్, జేవీఓలు నాగరాణి, కవికుమార్, ఎల్‌ఎస్‌ఏ రాంమోహన్, గోపాల మిత్ర సుధీర్ పాల్గొన్నారు.

బిట్స్‌లో మాక్ పోలింగ్



నర్సంపేట రూరల్ : మండలంలోని బాలాజీ టెక్నో స్కూల్ విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ సోమవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్ కార్యక్రమాన్ని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైందని, దాన్ని సద్వినియోగం చేసుకోని ఉత్తమ పాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం బ్యాలెట్ పేపర్లను ఆవిష్కరించి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మాక్ పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెరుమాండ్ల రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.